‘కౌలు’కు డిమాండ్..!

- ఎకరానికి రూ.18వేల నుంచి రూ. 20 వేలు
- ఆందోళనలో కౌలు రైతులు
- ప్రభుత్వం ఆదుకోవాలని విన్నపం



కౌటాలలో ట్రాక్టర్‌తో పత్తి కట్టె తొలగిస్తున్న కౌలు రైతు

కౌటాల: జిల్లాలోని రైతులకు సాగునీరు అందించేందుకు భారీ ప్రాజెక్టులు లేకపోవడంతో పంటలు ఏటా ఆశించిన స్థాయిలో దిగుబడి రావడం లేదు. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. దీనికి తోడు ఏటా కౌలు భూముల ధరలు పెంచుతున్నారు. అయినా సాగు మీద ఉన్న ప్రేమతో కౌలు రైతులు కౌలు భూములకు ఎంత ధరైనా చెల్లిస్తున్నారు. ఇప్పుడు కాకపోయినా మరో ఏడాదైనా సాగు బాగు చేస్తుందని రైతులు ఆశతో కౌలు భూములను సాగు చేస్తున్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు రైతుభరోసా, రుణమాఫీ, రైతుబీమా పథకాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడితే.. కేంద్రం పంట పెట్టుబడి అందిస్తోంది. ఇవన్ని రైతులకు ఎంతో కొంత లబ్ధిచేకూరుస్తున్నాయి. అయితే కౌలు రైతుల పరిస్థితి మాత్రం ఇందుకు భిన్నంగా ఉంది. ఎన్నో ఏళ్లుగా కౌలు రైతులను పట్టించుకునే ప్రభుత్వాలే కరువయ్యాయి. నిజానికి కౌలు రైతును రైతుగా చూడని పరిస్థితి ఏర్పడింది. అసలే వ్యవసాయం కష్టాల సాగుగా మారింది. సొంత భూమిలో వ్యవసాయం చేసే రైతులు స్వల్ప లాభాలతో బయటపడుతున్నా.. కౌలు రైతులకు మాత్రం నష్టాలే మిగులుతున్నాయి.

35 వేల మంది కౌలు రైతులు..

జిల్లాలోని 15 మండలాల పరిధిలో సుమారు మొత్తం ఒక లక్ష 45 వేల వరకు రైతులుండగా వారిలో సుమారు 35 వేల మంది కౌలు రైతులు ఉన్నట్లు వ్యవసాయశాఖ అధికారుల అంచనా ఉంది. మళ్లీ కౌలు కాలం ప్రారంభమైంది. ప్రస్తుతం గ్రామాల్లో కౌలు రైతులు భూములను వెతుకుతున్నారు. కౌలు రైతులు భూ యాజమానుల దగ్గర కౌలు మాట్లాడుకుంటున్నారు. దిగుబడి వచ్చినా, రాకపోయినా, రైతు భరోసా పథకం, కేంద్ర ప్రభుత్వం కిసాన్ పథకంలో పెట్టుబడి సాయం భూ యజమానులకు అందిస్తున్న కౌలు మాత్రం తగ్గడం లేదు. ఏటా వేలల్లో కౌలు పెరుగుతుందే తప్పా తగ్గడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటు కేంద్రం, అటు రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న రైతు సంబంధ పథకాల్లో కౌలు రైతులకు నయా పైసా వచ్చేది లేదు. చివరకు పంట రుణాలు కూడా రాని పరిస్థితి ఉంది. ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల దగ్గర వడ్డీకి తెచ్చి సాగు చేస్తున్నా చివరకు నష్టాలే మిగులుతున్నాయి.

ఎకరానికి రూ. 20 వేలు..

భూమి రకాన్ని బట్టి కౌలు ధరను నిర్ణయిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో నల్లరేగడి, ఎర్రరేగడి, పలు రకాల భూముల కోసం ఎకరానికి రూ.18 వేల నుంచి రూ. 20 వేలు చొప్పున చెల్లిస్తున్నారు. పత్తి సీజన్ అయిపోయే వరకు మాత్రమే లీజు కుదుర్చుకుంటున్నారు. ఇందులో రహదారి పక్కన, సాగు నీటి సౌకర్యం ఉన్న భూములకు అదనంగా మరికొంత లీజు చెల్లిస్తున్నారు. కౌలు భూములకు ఏటా ధరలు పెరుగుతున్నాయి. చేను భూములు ఎకరానికి రూ. 18 వేల నుంచి 20 వేల వరకు కౌలు ధర చెల్లిస్తున్నారు. వరి పంట పొలాలకు ఎకరానికి రూ.12 వేల నుంచి రూ.15 వేల వరకు కౌలు ధర చెల్లించి వరి పంట పొలాలను కౌలు రైతులు పడుతున్నారు. ఇప్పటికే కొంత మంది రైతులు భూమి లీజుకు ఇవ్వడానికి ఒప్పందం చేసుకోగా, ఇంకా లీజు భూముల కోసం జోరుగా యత్నాలు చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో ఎకరాకు రూ.22 వేలు ధర చెల్లించాలనే డిమాండ్ కూడా వినిపిస్తోంది.

భూముల కోసం తిరుగుతున్నాం..

గతంలో కౌలు భూమి ఎకరానికి రూ. 5 వేల నుంచి రూ. 7 వేలు మాత్రమే ఉండేది. అందరూ పత్తి పంట సాగు చేస్తుండడంతో ఒక్కసారిగా భూమి కౌలు ధర పెరిగింది. ఇప్పుడు ఎకరానికి రూ.15 వేలు ఇస్తామన్నా భూమి కౌలుకు ఇయ్యడానికి ముందుకచ్చే వారు లేరు. ప్రస్తుతం కౌలు భూముల కోసం ఊళ్లల్లో తిరుగుతున్నాం. ఏటా కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో దిగుబడులు రాక పెట్టిన పెట్టుబడులు సైతం చేతికి అందని పరిస్థితులు దాపురించాయి. దిగుబడి వచ్చినా.. రాకపోయినా.. ఏటేటా భూ యజమానులకు కౌలు చెల్లించాల్సి వస్తోంది. – రవి, కౌలు రైతు, తలోడి

రిజర్వేషన్ల రద్దుకు బీజేపీ కుట్రలు



రెబ్బెనలో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

రెబ్బెన: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చి ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను రద్దు చేసేందుకు కుట్రలు పన్నుతోందని కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ అన్నారు. మండలంలోని గంగాపూర్, పాశిగాం, లక్ష్మిపూర్ గ్రామాల్లో మంగళవారం జై బాపు, జై భీం, జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మహాత్మాగాంధీ, అంబేడ్కర్‌ల చిత్రపటాలతో పాటు రాజ్యాంగంతో ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఉన్న అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్యాం, పార్టీ మండల అధ్యక్షుడు లావుడ్య రమేశ్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, నాయకులు వెంకటేశం చారి, గాజుల రవీందర్, ముంజం రవీందర్, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి..

కౌటాల: అంబేడ్కర్ ఇచ్చిన స్వేచ్ఛ, సామాజిక సమానత్వాన్ని, భారత రాజ్యాంగాన్ని బీజేపీ ప్రభుత్వం నుంచి కాపాడాలని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. మంగళవారం సాయంత్రం కౌటాల మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలన్ని ప్రారంభించారు. బోదంపల్లి గ్రామంలో జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ దేశంలో అప్రజాస్వామిక నియంతృత్వ పాలన చేస్తుందని ఆరోపించారు. అంతకుముందు పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరడంతో వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమాల్లో పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్ రావు, జెడ్పీ మాజీ చైర్మన్ సిడాం గణపతి, పార్టీ కౌటాల కన్వీనర్ నికోడే గంగారాం, పార్టీ చింతలమానెపల్లి కన్వీనర్ ఎస్ ఉమా మహేశ్, నాయకులు విఠల్, గట్టయ్య, ఖాళీం, భాస్కర్, నానయ్య, ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.



కమ్మర్‌గాంలో ప్రతిజ్ఞ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

‘అమిత్‌షా వ్యాఖ్యలు సరికావు’

పెంచికల్‌పేట్: భారత రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు సరికావని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం కమ్మర్‌గాం, మురశీగూడ, జిల్లెడ గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు పర్యటించి గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. వారు మాట్లాడుతూ బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు రాజ్యాంగ నిర్మాతను అవమానపరిచేలా మాట్లాడుతున్న విషయాన్ని ప్రతి ఒక్కరు ఖండించాలన్నారు. అంతకుముందు గిరి గ్రామాల్లోని కుమురం భీం విగ్రహాలకు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు చంద్రమౌళి, మధునయ్య, నాయకులు సముద్రాల రాజన్న, రాచకొండ కృష్ణ, సిరిపురం సదాశివ్, ఇలియాస్, బాపు, బాపురావు, శంకర్‌గౌడ్, సకరాం పాల్గొన్నారు.

క్లుప్తంగా

‘బీజేపీ స్థాపన దివస్ నిర్వహించండి’



మాట్లాడుతున్న కోవ విజయ్

కెరమెరి: ఈనెల 6 నుంచి ప్రారంభమైన బీజేపీ స్థాపన దివస్‌ను నిర్వహించాలని ఆ పార్టీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో క్రియాశీల సభ్యులతో పాటు మండల కమిటీ నాయకులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈనెల 12 వరకు బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రతీ గ్రామంలో నిర్వహించాలన్నారు. జిల్లా నాయకుడు వెంకట్, మండలాధ్యక్షుడు సెడ్మకి తుకా రాం, నాయకులు వేణు, సుభాశ్ తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని సత్యసాయి సదన్, జుబ్లీ మార్కెట్ ప్రాంతంలో బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ లక్ష్మీరాజం ఒక ప్రకటనలో తెలిపారు. గుండి రోడ్డులోని వైర్ లైన్ అప్‌గ్రేడ్ పనుల నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని పేర్కొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

చింతలమానెపల్లి: విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కౌటాల సీఐ ముత్యం రమేశ్ అన్నారు. మంగళవారం మండలంలోని గంగాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు షీటీం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈవ్‌టీజింగ్, బాలికలపై హింసకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సోషల్ మీడియాకు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. ఎస్సై నరేశ్, షీటీం ఇన్‌చార్జి సునీత పాల్గొన్నారు.

ఉత్సవ ర్యాలీ పోస్టర్ ఆవిష్కరణ

కాగజ్‌నగర్‌రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఉత్సవ ర్యాలీ పోస్టర్లను ఎమ్మెల్యే హరీశ్‌బాబు విడుదల చేశారు. మంగళవారం పట్టణంలోని సర్‌సిల్క్‌కాలనీలోని ఎమ్మెల్యే నివాసంలో ఈనెల 14వ తేదీన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతి ఉత్సవ ర్యాలీ పోస్టర్లు ఆవిష్కరించారు.

చలివేంద్రం ప్రారంభం

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని మోసం గ్రామపంచాయతీలో గల ఆరెగూడ గ్రామంలో ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిపై మంగళవారం చలివేంద్రాన్ని గ్రామపంచాయతీ స్పెషల్ అధికారి పర్శ చంద్రశేఖర్, కార్యదర్శి రాజేశ్వరి ప్రారంభించారు. వేసవికాలంలో ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాన్ని ప్రారంభించినట్లు పేర్కొన్నారు.

భక్తులకు హనుమాన్ చాలీసా పంపిణీ

నార్నూర్: మండల కేంద్రంలోని పురాతన ఆలయంలో మంగళవారం హనుమాన్ దీక్ష చేపట్టిన స్వాములకు హనుమాన్ చాలీసా పుస్తకాలను హిందూ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు జ్ఞానోబా పుస్కర్ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మంతో పాటు సంస్కృతి, సంప్రదాయ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఫాక్స్ చైర్మన్ అడే సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కల్యాణ మహోత్సవం

గుడిహత్నూర్: మండలంలో నెలకొన్న అతి ప్రాచీన శివాలయంలో బుధవారం శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించనున్నారు. ఆలయంలో గత ఆరు రోజులుగా జరిగిన సప్తాహంలో ప్రతీరోజు భజనలు, కీర్తనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏడో రోజు బుధవారం మధ్యాహ్నం రథోత్సవం నిర్వహించి సాయంత్రం 6.05 గంటలకు శివపార్వతుల కల్యాణం జరుపనున్నారు. రథోత్సవంలో భాగంగా నగర ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర కొనసాగనుంది. మహారాష్ట్ర వార్కరీ సంప్రదాయం ప్రకారం నిర్వహించే వేడుకలో మహిళలు, పురుషులు ‘విఠోబా మావులీ తుకారాం’ అంటూ నృత్యాలు చేస్తూ ముందుకు సాగుతారు. హనుమాన్ దీక్షాపరులు రథాన్ని లాగుతారు. కల్యాణం అనంతరం మహా అన్నదాన ప్రసాద వితరణ నిర్వహించనున్నారు. మహారాష్ట్ర నుంచి వేల సంఖ్యలో భక్తులు ఆలయానికి రానున్నారు.

22వ రోజుకు సీపీఐ దీక్షలు

కైలాస్‌నగర్: సర్వే నంబర్ 170, నిషాన్‌ఘాట్‌లో గుడిసెలు వేసుకొని నివసిస్తున్న పేదలకు మౌలిక సౌకర్యాలు కల్పించాలనే డిమాండ్‌తో సీపీఐ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం 22వ రోజుకు చేరాయి. దీక్షల్లో సీపీఐ జిల్లా కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, పార్టీ నాయకులు అరుణ్ కుమార్, కాంబ్లే రాందాస్, సాగర్, చందు, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

హైందవ ధర్మ పరిరక్షణ కోసం పాటుపడాలి

- ఎమ్మెల్సీ దండె విఠల్



పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ విఠల్

బెజ్జూర్: హైందవ ధర్మ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ పాటుపడాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. మండల కేంద్రంలోని శ్రీ రంగనాయక ఆలయ ప్రాంగణంలో ఎమ్మెల్సీ దండే విఠల్ మండలంలోని అంజన్న స్వాములకు భిక్ష కార్యక్రమం ఏర్పాటు చేసి హనుమాన్ విగ్రహానికి పూజలు చేశారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడికి సన్మానం..

మండల కేంద్రంలోని శ్రీ రంగనాయక ఆలయ ప్రాంగణానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్ తొలిసారి రావడంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ దండె విఠల్ ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆలయ అభివృద్ధికి రూ.20లక్షల నిధులు మంజూరు చేయాలని ఆలయ కమిటీ సభ్యులు వినతిపత్రం అందించారు. సానుకూలంగా స్పందించిన ఆయన ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి నిధులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. తహసీల్దార్ భూమేశ్వర్, ఎంపీడీవో బండారి ప్రవీణ్ కుమార్, ఏఎవో రాజన్న, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ సిడాం గణపతి, మాజీ జెడ్పీటీసీ పుష్పలత, శారద జగ్గాగౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీవర్ధన్, ఆలయ కమిటీ అధ్యక్షుడు మహేశ్ నాయకులు పాల్గొన్నారు.

సెక్యూరిటీగార్డులుగా శాశ్వత ఉద్యోగులను నియమించాలి



జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాస్‌రావు

రెబ్బెన: సింగరేణిలో సెక్యూరిటీగార్డులుగా సింగరేణి పర్మినెంట్ ఉద్యోగులనే నియమించాలని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు డిమాండ్ చేశారు. మంగళవారం గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో ఏరియా జనరల్ మేనేజర్ విజయ భాస్కర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ సింగరేణిలో మాజీ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన కారుణ్య నియామకం ద్వారా సుమారు 1500 మంది యువ కార్మికులు విధుల్లో చేరారన్నారు. అయినా సింగరేణిలో సెక్యూరిటీ గార్డులుగా హైదరాబాద్, ముంబాయిలకు చెందిన కాంట్రాక్టర్లకు టెండర్‌లు ఇచ్చి సింగరేణి ధనాన్ని యాజమాన్యం వృధా చేస్తోందన్నారు. యువ కార్మికులు అనారోగ్య సమస్యల కారణంగా అండర్ గ్రౌండ్‌లో విధులు నిర్వహించలేకపోతున్నారన్నారు. సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ధరావత్ మంగీలాల్, ఏరియా కార్యదర్శి అలవేణి సంపత్, సెంట్రల్ కమిటీ నాయకులు కిరణ్, ఫిట్ కార్యదర్శులు రమేశ్, శ్రీనివాస్, కమిటీ సభ్యులు చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

అమరుల త్యాగాల ఫలితమే ప్రత్యేక రాష్ట్రం



నివాళులర్పిస్తున్న తహసీల్దార్ రామ్మోహన్‌రావు, ఎస్సై చంద్రశేఖర్

రెబ్బెన: తెలంగాణ అమరవీరుల త్యాగాల ఫలితంగా ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందని తహసీల్దార్ రామ్మోహన్‌రావు, ఎస్సై చంద్రశేఖర్‌లు అన్నారు. మండల కేంద్రానికి చెందిన తెలంగాణ అమరవీరుడు తాళ్లపెల్లి వేణుకుమార్ గౌడ్ 13వ వర్ధంతిని మంగళవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు, తెలంగాణ ఉద్యమకారులతో కలిసి వేణుకుమార్‌గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, మాజీ ఎంపీటీసీ మదునయ్య, గౌడ సంఘం అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్, నాయకులు గాజుల రవీందర్, పల్లె రాజేశ్వర్‌రావు, రాజాగౌడ్, అన్నపూర్ణ మురళీగౌడ్, బీఆర్‌ఎస్ మహిళా విభాగం నాయకురాలు శంకరమ్మ, అన్నపూర్ణ అరుణ పాల్గొన్నారు.

లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ధనుంజయ్

దహెగాం: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను మంగళవారం బీజేపీ మండల అధ్యక్షుడు రాపర్తి ధనుంజయ్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. లగ్గాం, కమ్మర్‌పల్లి, గిరవెల్లి, ఐనం గ్రామాలకు చెందిన 13 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు.

బెజ్జూర్: సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్ బాబు ఆదేశాల మేరకు మంగళవారం మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంగళవారం బీజేపీ నాయకులు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఉమ్మెర బాలకృష్ణ, రాజరాం, సామల తిరుపతి, జాడి తిరుపతి, శ్యాంసుందర్, దిగంబర్ తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్: ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే హరీశ్‌బాబు అన్నారు. మంగళవారం పట్టణంలోని సంతోష్ ఫంక్షన్‌హాల్‌లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. మొత్తం 314 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఆర్‌ఐ సిద్ధార్థ్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు శివ, మండల అధ్యక్షుడు పుల్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

దీక్షలతో పల్లెలు పునీతం!

- భజనలతో మారుమోగుతున్న గిరిసీమలు
- ఎటు చూసినా హనుమాన్ స్వాములే
- పల్లెల్లో పెరుగుతున్న భక్తిభావం



ధ్యానం చేస్తున్న హనుమాన్ దీక్షాస్వాములు

కెరమెరి: ప్రస్తుత సమాజంలో పాశ్చత్య పోకడలకు పోతున్న యువత ఆధ్యాత్మిక మార్గం వైపు ఆసక్తి చూపుతున్నారు. హనుమాన్ జయంతి పురస్కరించుకొని 41 రోజుల నుంచి ఆంజనేయ స్వామి దీక్షలు చేపట్టి భక్తిభావంలో నిమగ్నమవుతున్నారు. ఈ తరుణంలో అనేక గ్రామల్లో చిన్నా, పెద్దా తేడా లేకుండా కొందరు 41, 21, 11 రోజులు ఆంజనేయ స్వామి దీక్షలు చేపడుతున్నారు. మండల కేంద్రంతో పాటు ఇతర గ్రామాల్లో మొత్తం 309 మంది ఆంజనేయ స్వామి దీక్షలు స్వీకరించారు.

నిష్ఠగా..

దీక్షలు చేపట్టే కాలంలో స్వాములు నిష్ఠగా ఉంటారు. ఒంటిపూట భోజనం మాత్రమే చేస్తారు. చల్లని నీటితో స్నానాలు చేసిన అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మంగళహారతులు, మాలజపం, ఆంజనేయ స్వామి విగ్రహాల ముందు కూర్చొని వివిధ రకాల పాటలు పాడుతూ భజనలు చేస్తుండడంతో గిరిసీమలు మారుమోగుతున్నాయి. నగర కీర్తనలు చేస్తూ భక్తిభావాన్ని చాటి చెబుతున్నారు. కెరమెరి మండల కేంద్రంతో పాటు కెలి(కే), సాంగ్వి, గోయేగాం, భోలాపటార్, లెండిగూడ, బాబేఝరి, మహరాగూడ, సావర్‌ఖెడా జిల్లాలోని అనేక మండలాల్లో దీక్షలు స్వీకరించారు.

దేవునిపై నమ్మకం పెరుగుతుంది..



ప్రతిరోజు క్రమం తప్పకుండా పూజలు చేయడం వల్ల దేవునిపై నమ్మకం పెరుగుతుంది. దీక్షల్లో చేపట్టే అలవాట్లు ఆరోగ్యానికి కూడా చాలా మంచివి. దీక్షలు లేని సమయలో కూడా ఇలాగే ఉండేందుకు ప్రయత్నించాలి. – రాథోడ్ వికాస్, గురుస్వామి

కొత్త అనుభూతి కలుగుతుంది..



దీక్ష కాలంలో ఏదో తెలియని అనుభూతి కలుగుతుంది. దేవునిపై భక్తిభావం పెరుగుతుంది. ఏకాగ్రత ఉంటుంది. ఒంటిపూట భోజనం చేయడం, స్వాములతో కలిసి పూజల్లో పాల్గొనడం మంచి గనిపిస్తుంది. – సెండే క్రిష్ణ, కన్యస్వామి

నిష్ఠగా ఉంటాం..



దీక్షలతో పల్లెలు పునీతమవుతున్నాయి. అంతా నిష్ఠగా ఉంటున్నాం. మనసుకు ప్రశాంతంగా ఉంటుంది. నియమాలు పాటిస్తున్నాం. హిందువులు ప్రతిఒక్కరు దీక్షలు స్వీకరించాలి. – వాడై ప్రకాశ్, గురుస్వామి

అట్టహాసంగా హనుమాన్ శోభాయాత్ర



శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

తిర్యాణి: మండలంలో హనుమాన్ శోభాయాత్ర మంగళవారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని తలండి గ్రామంలోని రామాలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి శోభాయాత్ర ప్రారంభించారు. మండలం కేంద్రం గుండా చింతపల్లి హనుమాన్ టెంపుల్ వరకు యాత్ర కొనసాగింది. హనుమాన్ మాలదారులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కొండగట్టుకు స్వాముల పాదయాత్ర



పాదయాత్రగా వెళ్తున్న స్వాములు

ఆసిఫాబాద్‌అర్బన్: ఏప్రిల్ 12న హనుమాన్ జయంతి పురస్కరించుకొని హనుమాన్ దీక్షలు స్వీకరించిన దీక్షాస్వాములు మంగళవారం జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయం నుంచి కొండగట్టుకు పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఒజ్జల శిరీష్‌శర్మ స్వాములకు ఇరుముడులు కట్టి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొండగట్టుకు పాదయాత్రగా బయలుదేరిన వారిలో స్వాములు చిప్ప కిరణ్, పైదం అంజన్న, రాపర్తి ప్రశాంత్, నీకురే లహంచు, రాజేశ్వర్, బుచ్చయ్య, సుధీర్, రమేశ్, ఆత్రం చిన్ను, రాజు ఉన్నారు. ఆలయ కమిటీ సభ్యులు వివేక్, శ్రీనివాస్, నారాయణమూర్తి, మధు, రాధాకృష్ణ చారి, వెంకటేశ్వర్లు, భక్తులు పాల్గొన్నారు.

నాణ్యతతో పనులు చేపట్టాలి



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న కోవ విజయ్

కెరమెరి: నాణ్యత ప్రమాణాలతో కూడిన పనులు చేయాలని బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్ కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బీసీ వాడలో ఎంపీ నిధులతో సీసీరోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. గత కొంత కాలంగా మట్టి, దుబ్బల్లో నడిచే ప్రజలకు ఇక కష్టాలు తీరినట్లేనని పేర్కొన్నారు. మండలాధ్యక్షుడు సెడ్మకి తుకారాం, నాయకులు రంగు శ్రీకాంత్, సోనేరావు, సుభాశ్, వినేశ్, సురేశ్ తదితరులు ఉన్నారు.